క్లుప్తంగా

అశుతోష్ శ్రీవాత్సవ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ మాధవీలతను కలిసిన కొవ్వూరు నూతన సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

రాజమహేంద్రవరం సిటీ: కొవ్వూరు సబ్ కలెక్టర్‌గా అశుతోష్ శ్రీవాత్సవ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలతను, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీవాస్తవను కలెక్టర్ మాధవీలత అభినందించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సబ్ కలెక్టర్‌గా కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని అన్నారు. జేసీ తేజ్‌భరత్ కూడా శ్రీవాత్సవకు అభినందనలు తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌కి చెందిన శ్రీవాత్సవ 2021 ఐఏఎస్ బ్యాచ్ అధికారి. గ్వాలియర్‌లో బీఈ (ఎలక్ట్రానిక్స్) చదివి, 2021 సివిల్స్‌లో 223 ర్యాంక్ సాధించిన ఆయనను ఆంధ్రా కేడర్‌కు కేటాయించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో అసిస్టెంట్ కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ పొందారు. అక్కడి నుంచి సబ్ కలెక్టర్‌గా బదిలీపై కొవ్వూరు వచ్చారు.

ప్రజారోగ్యంపై జగన్ ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ



కరిచర్లగూడెంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ఇంత వరకూ రూ.5 లక్షలుగా ఉన్న ఆరోగ్యశ్రీ పథకం వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు పెంచడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కొత్త ఫీచర్లతో జారీ చేసిన స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మండలంలోని కరిచర్లగూడెం గ్రామంలో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామ సచివాలయం పరిధిలోనూ ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు ఫ్యామిలీ డాక్టర్‌ను నియమించిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పఠాన్ అన్వర్ బాషా, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, ఎంపీటీసీ సభ్యురాలు కనకదుర్గ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, మహిళా కన్వీనర్ యండపల్లి కవిత, పార్టీ అధికార ప్రతినిధి ఎస్కే వలీ, ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నిడదవోలులో..

నిడదవోలు: ప్రజలందరికీ ఆరోగ్య భరోసా కల్పించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు పెంచారని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. ఆరోగ్యశ్రీ పథకంపై బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. కమిషనర్ కేవీ పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ పాల్గొన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సంధ్య మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ యాప్ ద్వారా ఆరోగ్యశ్రీ పథకం సేవల పరిధి, ఏయే వ్యాధులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించుకోవచ్చునో, నెట్‌వర్క్ ఆసుపత్రుల వివరాలను ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్ ద్వారానే తెలుసుకోవచ్చన్నారు. పలువురు ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఏవీఆర్ఎస్ తాతారావు, డాక్టర్ ఈ.తేజశ్రీ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రుడా చైర్మన్‌గా రౌతు సూర్యప్రకాశరావు



రుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సూర్యప్రకాశరావు

సాక్షి, రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రుడా చైర్‌పర్సన్‌గా సేవలందించిన మేడపాటి షర్మిలారెడ్డి పదవీ కాలం కొద్ది రోజుల కిందట ముగిసింది. ఆమె స్థానంలో రౌతును నియమించారు. రాజమండ్రి సిటీ ఎమ్మెల్యేగా ఆయన పదేళ్ల పాటు సేవలందించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకం ఉంచి, అప్పగించిన ఈ పదవిని బాధ్యతతో నిర్వర్తిస్తానని రౌతు చెప్పారు. రుడా కార్యాలయంలో చైర్మన్‌గా బుధవారం సాయంత్రం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

18 వేల కుటుంబాల సొంతింటి కల సాకారం

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- కొత్తపల్లి అగ్రహారంలో అధికారిక కార్యక్రమాలు



ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులతో నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: నిడదవోలు నియోజకవర్గంలో 18 వేల కుటుంబాల సొంతింటి కల నెరవేరిందని, ఇంతటి బృహత్తర కార్యక్రమంలో భాగస్వామిని అయినందుకు తనకు ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పేర్కొన్నారు. మండలంలోని కొత్తపల్లి అగ్రహారంలో బుధవారం నిర్వహించిన పలు అధికారిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత గ్రామంలోని 80 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ చేశారు. అనంతరం రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. తర్వాత రూ.35 లక్షలతో చేపట్టే తాగునీటి పైప్‌లైన్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 30.75 లక్షల మంది పేదకు ఇళ్ల పట్టాలు ఇస్తే, నిడదవోలు నియోజకవర్గంలో 11,885 మందికి పట్టాలు అందిస్తున్నామన్నారు. వీటితో పాటు స్థలాలు ఉన్న 4,766 మందికి గృహాలు, నిడదవోలు పట్టణంలో 1152 మంది టిడ్కో గృహాలు అందిస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, ఎంపీడీఓ రమేష్, ఎంపీటీసీ సభ్యుడు నక్కా పాలేశ్వరరావు, ద్వారకా తిరుమల దేవస్థానం పాలకమండలి సభ్యుడు పాలా వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కోర్ల ఉదయ భాస్కరరావు, కోపెల్ల వెంకటేశ్వరరావు, పిల్లా శ్రీను, కోపెల్ల తాతయ్య, వివిధ పంచాయతీల సర్పంచులు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నయనానందం .. శ్రీనివాస కల్యాణం



కొవ్వూరులో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న టీటీడీ వేద పండితులు

కొవ్వూరు: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో కొవ్వూరు సంస్కృత పాఠశాల ప్రాంగణంలో బుధవారం రాత్రి శ్రీనివాస కల్యాణాన్ని కనుల పండువలా నిర్వహించారు. టీటీడీ వేద పండితుల మంత్రోచ్చరణలతో, గోవింద నామ స్మరణతో ప్రాంగణంలో దద్దరిల్లింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై తిరుపతి నుంచి తీసుకొచ్చిన ఉత్సవ విగ్రహాలకు టీటీడీ ట్రస్టు బోర్డు మెంబర్ గాదిరాజు వెంకట సుబ్బరాజు దంపతుల ఆధ్వర్యంలో కల్యాణ తంతు నిర్వహించారు. సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల వరకు అన్నమాచార్య కళాబృందం సంకీర్తనలు, హరికథ నిర్వహించాయి. అనంతరం స్వామి వారి కల్యాణం నిర్వహించారు. మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ గండ్రోతు అంజనీదేవి, డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ దంపతులు, ఆంధ్ర గీర్వాణ విద్యా పీఠం కార్యదర్శి టీఎస్‌వీ రమణ మూర్తి దంపతులు, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, మాజీ మునిసిపల్ చైర్ పర్సన్ జొన్నలగడ్డ రాధారాణి వేలాదిగా భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

దేవరపల్లి: మండలంలోని గొల్లగూడెం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం రాజమహేంద్రవరం నుంచి జంగారెడ్డిగూడెం వెళుతున్న కారు, గోపాలపురం నుంచి దేవరపల్లి వైపు వస్తున్న ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. వారికి గోపాలపురం ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బుధవారం ఉదయం గోపాలపురం వెళుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు , ట్రైనీ డీఎస్పీ భానోదయ, సీఐ అనసూరి శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని బుధవారం పరిశీలించారు. దేవరపల్లి ఎస్సై- 2 కొండలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కొవ్వూరులో ఉచిత కంటి వైద్య శిబిరం

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా గురువారం ఉదయం తొమ్మిది గంటల నుంచి స్థానిక అచ్చాయమ్మ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుంది. శ్రీరామ సొసైటీ అధ్యక్షుడు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర బుధవారం ఈ విషయం తెలిపారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ఎంపీడీవో రామ్‌ప్రసాద్‌కు వీడ్కోలు సత్కారం



ఎంపీడీవో రామ్‌ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు,అధికారులు

చాగల్లు: అంకితభావంతో విధులు నిర్వహించే అధికారులకు గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైఎస్సార్ సీపీ మండల శాఖ గౌరవాధ్యక్షుడు జుట్టా ఏడుకొండలు అన్నారు. చాగల్లు ఎంపీడీవోగా పనిచేసి, డ్వామా ఏపీడీగా పదోన్నతి పొంది బదిలీపై వెళుతున్న పి.రామ్‌ప్రసాద్ అభినందన సభ గురువారం మండలంలోని నెలటూరు గ్రామంలోని సీతారామస్వామి కల్యాణ మండపంలో నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి, పలువురు ప్రజాప్రతినిధులు తమ ప్రసంగాల్లో గత నాలుగున్నరేళ్లుగా చాగల్లు మండలాభివృద్ధికి రామ్‌ప్రసాద్ చేసిన కృషిని కొనియాడారు. అనంతరం ఎంపీడీవో రామ్‌ప్రసాద్, సుజాత దంపతులను దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నిడదవోలు రూరల్: మూడు రోజుల క్రితం పురుగు మందు తాగిన మండలంలోని పెండ్యాల గ్రామానికి చెందిన మట్టా లక్ష్మణరావు అనే వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. సమిశ్రగూడెం ఏఎస్సై పరమహంస తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇంటిని నిర్మించుకునే విషయంలో లక్ష్మణరావు, అతడి భార్య లక్ష్మి మధ్య ఈ నెల 17న వివాదం తలెత్తింది. దంపతుల మధ్య కొంత వాగ్వాదం సాగింది. దీంతో మనస్థాపానికి గురైన లక్ష్మణరావు కొద్ది సేపటికి పురుగు మందు తాగాడు. లక్ష్మణరావు ఆరోగ్య పరిస్థితిని గుర్తించిన కుటుంబ సభ్యులు అతడిని అత్యవసర వైద్యం నిమిత్తం ఏలూరులోని ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మణరావు బుధవారం మృతి చెందాడు. దీనిపై భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సమిశ్రగూడెం పోలీసులు తెలిపారు.





నిడదవోలు గణపతి జంక్షన్‌లో రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, మునిసిపల్ చైర్మన్ ఆదినారాయణ తదితరులు

పునరావాసం తర్వాతే జంక్షన్ అభివృద్ధి

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- జంక్షన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

నిడదవోలు: ఆక్రమణల తొలగింపుతో పట్టణంలో నిరాశ్రయులైన షాపుల నిర్వాహకులకు, నివాసితులకు జగనన్న కాలనీలో ఇళ్లు, స్థలాలు కేటాయించామని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పట్టణంలోని గణపతి జంక్షన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఆయన అధికారులతో కలసి పరిశీలించారు. స్థానిక పాటిమీద సెంటర్ నుంచి గణపతి కూడలి వరకూ నాలుగ లేన్ల రోడ్డు విస్తరణ, గణపతి జంక్షన్ అభివృద్ధి పనులను రూ.4.25 కోట్ల వ్యయంతో చేపట్టిన విషయం తెలిసిందే. పనులను పరిశీలించిన ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఈ సెంటర్లోని మున్సిపాలిటీకి చెందిన స్థలంలో నివాసం ఉంటున్న పది మంది నిరాశ్రయులకు జగనన్న కాలనీలో నూతన గృహాలను నిర్మించామన్నారు. ఇక్కడ తొలగించిన షాపుల యజమానులకు, అద్దె షాపుల్లో వ్యాపారాలు చేసుకుంటున్న వారికి కూడా జగనన్న కాలనీలో స్థలాలు కేటాయించామన్నారు. ఆ తర్వాతే గణపతి జంక్షన్ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ డీఈ మాధవి, ఏఈ హేమంత్ కమల్ పాల్గొన్నారు.



యువతి అదృశ్యంపై కేసు నమోదు

కొవ్వూరు: ఇరవై రెండేళ్ల వయసున్న తన కుమార్తె బుధవారం ఉదయం 11 గంటల నుంచి కనిపించడం లేదని పట్టణానికి చెందిన ఆ యువతి తల్లి కొవ్వూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. షాపునకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన కుమార్తె తిరిగి రాలేదని ఆమె ఆ ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై బి.దుర్గా ప్రసాద్ తెలిపారు.

నేడు విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

నల్లజర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా గురువారం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించనున్నారు. ఇప్పటికే మండల విద్యావనరుల కేంద్రానికి ట్యాబ్‌లు చేరాయి. మండలంలో 8వ తరగతి విద్యార్థులు 546 మంది ఉన్నారు. తొలి విడతగా వారిలో 290 మందికి ట్యాబ్‌లు అందించనున్నారు. ఈ ట్యాబుల్లో 8వ తరగతి పాఠ్యాంశాలను అప్‌లోడ్ చేస్తారు. మిగిలిన విద్యార్థులకు మరో వారం రోజుల్లో ట్యాబ్‌లు అందించనున్నారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అధ్యక్షతన గురువారం దేవరపల్లి హైస్కూల్లో నిర్వహించే ఈ కార్యక్రమంలో మూడు మండలాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు పాల్గొంటారు.











